

సాక్షి కర్నూలు

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



డెడ్ స్టోరేజ్‌లో టీబీ డ్యాం

హొళగుంద: తుంగభద్ర డ్యాం డెడ్ స్టోరేజ్‌కు చేరింది. జలాశయంలో 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా 256 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతోంది.



ఉరిమిన ఆకాశం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. పలు చోట్ల ఇళ్ల సమీపంలో పిడుగులు పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. IIలో▸



సుందరీకరణకు చర్యలు

కలెక్టరేట్ సుందరీకరణకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సృజన తెలిపారు. అధికారులతో కలిసి కలెక్టరేట్‌ని వివిధ శాఖల కార్యాలయాలను శనివారం ఆమె పరిశీలించారు. IIలో▸

న్యూస్‌రీల్

జిల్లా ట్రెజరీ కార్యాలయాలకు కంప్యూటర్లు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఖజానా కార్యాలయాలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు సరఫరా చే యాలని నిర్ణయించింది. ఈ మేరకు ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా ట్రెజరీ కార్యాలయానికి 15 కంప్యూటర్లు, 3 ప్రింటర్లు, రెండు స్కానర్లు కేటాయించారు.. నంద్యాల జిల్లా ట్రెజరీ కార్యాలయానికి 12 కంప్యూటర్లు, 4 ప్రింటర్లు, రెండు స్కానర్లు కేటాయించారు. ఇవి త్వరలో ఆయా జిల్లాల ట్రెజరీ కార్యాలయాలకు చేరనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

రేపు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించి, పరిష్కరించుకోవచ్చని సూచించారు.

ఆర్‌యూ పరిధిలో ఒంటిపూట తరగతులు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో రేపటి(సోమవారం) నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కోవిడ్ కారణంగా ఉన్నత విద్యలో విద్యా సంవత్సరం సకాలంలో పూర్తి కానందున వేసవి సెలవులను రద్దు చేశారు. అయితే ఉన్నత విద్యా మండలి నుంచి ఆదేశాలు వస్తే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వర్సిటీ అధికారులు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాలకు రెట్టింపు డిమాండ్

కర్నూలు(అగ్రికల్చర్): రంజాన్ పండగ సందర్భంగా పాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. డిమాండ్‌కు అనుగుణంగా విజయ డెయిరీతో పాటు పలు ప్రయివేటు డెయిరీలు పాలు సరఫరా చేశాయి. మామూలు రోజుల్లో కర్నూలు విజయ డెయిరీ 68 వేల లీటర్ల పాలు విక్రయిస్తుండగా.. రంజాన్ నేపథ్యంలో 1.30 లక్షల లీటర్లకు పైగా పాలు విక్రయించడం విశేషం. శనివారం ఉదయం 4 గంటల నుంచే పాల అమ్మకాలు మొదలు కాగా.. మిల్క్ పార్లర్లు కిక్కిరిశాయి.

26లోపు 'పది' మూల్యాంకనం పూర్తి

కర్నూలు సిటీ: పదో తరగతి మూల్యాంకనాన్ని ఈ నెల 26వ తేదీలోపు పూర్తి చేస్తామని డీఈఓ డాక్టర్ వీ రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూల్యాంకనం క్యాంపు ప్రారంభించి శనివారం నాటికి నాలుగు రోజులవుతోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 1,00,17 సమాధాన పత్రాలు ముల్యాంకనం చేశారని తెలిపారు. ఇంకా 1,13,656 సమాధాన పత్రాలు దిద్దాల్సి ఉందన్నారు.

మహానందీశ్వరుడికి భారీ ఆదాయం

మహానంది: మహానందీశ్వరుడి ఆదాయం భారీగా పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వివిధ విభాగాల ద్వారా రూ. 16.89 కోట్ల ఆదాయం వచ్చింది. దేవస్థానం చరిత్రలో ఇంత ఆదాయం రావడం ఇదే ప్రథమం. ఆర్జిత సేవాటికెట్లు, ప్రసాదాల విక్రయం, వసతి గృహాల సముదాయం, భూముల వేలాలు, టోల్‌గేట్ల నిర్వహణ, అభిషేక సామాగ్రి విక్రయం, నవగ్రహదీపారాధన సామగ్రి విక్రయం, కొబ్బరిచిప్పల సేకరణ వేలాలు అన్ని కలిసి రూ. 20,73,06,851 రాగా ఖర్చులు రూ. 3,83,44,741 పోనూ నికరంగా రూ. 16,89,62,109 వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఆదాయ వివరాలను త్వరలో వెల్లడిస్తామని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

అల్లాహు అక్బర్!

- జిల్లాలో ఘనంగా రంజాన్ వేడుకలు
- ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఈద్ ముబారక్ అంటూ ఆలింగనాలు
- ప్రార్థనల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ పండుగను శనివారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అల్లాహు అక్బర్... లా ఇలాహ ఇల్లల్లా... హు అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లా హంద్... అంటూ తక్బీర్ చదువుకుంటూ ఉదయమే ఈద్గాలకు చేరుకున్నారు. ఈద్గాలకు వెళ్లలేని మరికొందరు మసీదుల్లో ఈద్ నమాజు చదువుకున్నారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించిన ఖాజీలు, మౌల్వీల ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేశారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. నమాజు, దువా అనంతరం ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. నమాజులో పాల్గొనేందుకు తరలివచ్చిన ముస్లింలతో ఈద్గాలు, మసీదులు కిక్కిరిసిపోయాయి. కొన్ని చోట్ల స్థలం లేక పోవడంతో రోడ్లపైనే నమాజు చేసుకున్నారు. కర్నూలులోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీంబాషా ఖాద్రీ, కొత్త ఈద్గాలో ముఫ్తీ సయ్యద్ మన్సూర్ అహ్మద్, గడ్డాలోని అహెలే హదీస్ ఈద్గాలో హాఫీజ్ మంజూర్ అహ్మద్, జొహరాపురం ఈద్గాలో హాఫీజ్ ఫరూఖ్ ఉమ్రి మదాని, లతీఫ్ లవుబాలి మసీదులో సయ్యద్ ఆరీఫ్ పాషా ఖాద్రీ నమాజ్ చేయించారు.

ఈద్ నమాజులో ప్రముఖులు

ఈదుల్ ఫితర్ నమాజుకు ప్రముఖులు హాజరయ్యారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ గడ్డా ఈద్గాతో పాటు పాత ఈద్గాలో, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాత ఈద్గాలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్నారు. ఐఏఎస్ అధికారి, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ సంతోష్ నగర్‌లోని కొత్త ఈద్గాలో జరిగిన నమాజులో పాల్గొన్నారు. హిందూ, ముస్లింలు పండుగ శుభాకాంక్షలు చెప్పుకోవడం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.





కర్నూలులోని పాత ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, (ఇన్‌సెట్) గడ్డా ఈద్గాలో రంజాన్ ప్రార్థన చేయిస్తున్న మతపెద్ద హాఫీజ్ మంజూర్ అహ్మద్



ప్రార్థనలకు హాజరైన ముస్లిం మహిళలు



దువా చేస్తున్న ముస్లింలు

మెడికల్ కళాశాలలో 150 సీట్లకు అనుమతి

బొమ్మలసత్రం: నంద్యాల మెడికల్ కళాశాలలో 2023-24 సంవత్సరానికి గాను 150 మెడికల్ సీట్లకు నేషనల్ మెడికల్ కమిషన్ శనివారం అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని సూపరింటెండెంట్ స్వర్ణలత తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నంద్యాల జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. 50 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల ఏర్పాటవుతోంది. నూనెపల్లి సమీపంలో కళాశాల నిర్మాణానికి రూ. 475 కోట్లు కేటాయించగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 85 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో గత నెల ఎన్ఎంసీ సభ్యులు కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి మెడికల్ విద్యార్థులకు అవసరమయ్యే ల్యాబ్‌లు, సౌకర్యాలు, లైబ్రరీ, నర్సింగ్, పారామెడికల్ స్టాఫ్‌కు అవసరమయ్యే వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు నివేదిక తయారు చేశారు. 2023-24కు మెడికల్ సీట్లు భర్తీ చేసి కళాశాలను నడపాల్సిందిగా ఎన్ఎంసీ అనుమతులు మంజూరు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



కొనుగోలుదారులతో కళకళలాడుతున్న బంగారు దుకాణం

సెంటిమెంట్ మెరిసింది!

- అక్షయ తృతీయ రోజున పెరిగిన బంగారం కొనుగోళ్లు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.150 కోట్ల వ్యాపారం

కర్నూలు(అగ్రికల్చర్): అక్షయ తృతీయను పురస్కరించుకుని శనివారం జ్యువెలరీ దుకాణాలకు ప్రజలు పోటెత్తారు. కర్నూలు షరాఫ్‌బజారుతో పాటు నగరంలోని కార్పొరేట్ దుకాణాలు ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా కనిపించాయి. నంద్యాల, ఆదోని, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఎమ్మిగనూరు పట్టణాల్లోని దుకాణాలు బంగారం కొనేవారితో కళకళలాడాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపు వెయ్యి బంగారం దుకాణాలు ఉండగా దాదాపు రూ.150 కోట్ల వ్యాపారం జరిగి ఉంటుందని అంచనా. అక్షయ తృతీయను పురస్కరించుకుని వాహనాల కొనుగోలు కూడా పెద్ద ఎత్తున జరిగాయి. వాహనాల కొనుగోలు చేసినవారికి వెండి బంగారు నాణేలను ఆఫర్లుగా ప్రకటించారు. పండగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నగలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ట్విన్ టన్నెళ్ల ద్వారా 20 వేల క్యూసెక్కులు తరలింపు

- ఈఎన్‌సీ నారాయణ రెడ్డి

అవుకు: త్వరలో ట్విన్ టన్నెళ్ల ద్వారా అవుకు రిజర్వాయర్‌కు 20 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలను తరలిస్తామని ఈఎన్‌సీ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. కర్నూలు సీఈ కబీర్ బాషాతో కలిసి శనివారం ఆయన అవుకు మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామ సమీపంలో టన్నెల్‌లో జరుగుతున్న ఫాల్ట్‌జోన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో ట్విన్ టన్నెళ్లను అందుబాటులోకి తెచ్చి వైఎస్సార్ కలను సాకారం చేస్తామన్నారు. సకాలంలో టన్నెళ్లు పూర్తయ్యే సమయానికి ఓ టన్నెల్‌లో ఫాల్ట్‌జోన్ రావడంతో ఆటంకం ఏర్పడిందన్నారు. దాదాపు 160 మీటర్లు ఫాల్ట్‌జోన్ ఏర్పడగా ప్రస్తుత ప్రభుత్వంలో అత్యాధునిక పరికరాలతో దాదాపు పూర్తి చేశారని, కేవలం 16 మీటర్లు మిగిలిందని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ఆయన వెంట ఎస్ఈ చెంగయ్య, ప్రాజెక్టు మేనేజర్ శ్రీహరి, ఈఈ, డీఈఈలు, ఏఈఈలు ఉన్నారు.



అవుకు టన్నెల్‌లో ఫాల్ట్‌జోన్ పనులను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నారాయణ రెడ్డి

మీ నాన్నకు రెండు ఎకరాలే.. నేను పుట్టుకతోనే భూస్వామిని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- లోకేశ్..నిజాలు తెలుసుకొని మాట్లాడు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని అర్బన్: ఎవరో అవగాహనలేని వారు రాసిచ్చిన స్క్రిప్టు చదవడం మాని, నారా లోకేశ్ నిజాలు తెలుసుకుని మాట్లాడాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హితవు పలికారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేతోపాటు ఆయన తనయుడు జయమనోజ్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కడితోట యువగళం సభలో నారా లోకేష్ తనపై, తన భార్య, కుమారుడిపై కబ్జాలు, దోపిడీలు అంటూ ఆరోపణలు చేశారని, వాటిని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. దమ్ము ధైర్యం ఉంటే చర్చకు సిద్ధమా అంటూ లోకేశ్‌కు సవాల్ విసిరారు. తాము పుట్టుకతోనే భూస్వాములమని కబ్జాలు చేసే చరిత్ర తమకు లేదని అన్నారు. "అప్పట్లో లోకేశ్ మీ నాన్నకు రెండు ఎకరాల భూమి ఉండేది. దోచుకో.. దాచుకో సిద్ధాంతం ద్వారా కొన్ని వందల కోట్ల ఆస్తిని మీరు ఎలా సంపాదించారు" అని ప్రశ్నించారు. సర్వేనం. 352లోని భూమిని టీడీపీ నాయకులే కబ్జా చేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని తిరిగి తీసుకొని బాధితులైన 350 మందికి అందజేసి న్యాయం చేశామన్నారు.

ఒక్కటైనా నిరూపించు

ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాలు ఇప్పించి ఎంతోమందితో డబ్బులు తీసుకున్నారని లోకేశ్ ఆరోపించారని ఇలాంటి పనులు చేయడం నారా వారికే చెల్లిందన్నారు. ఉత్తుత్తి ఆరోపణలు చేయడం కాదు ఒక్కటైనా నిరూపించాలని సవాల్ విసిరారు. ఎన్‌జీఓ స్థలాన్ని ఎర్రిస్వామి అనే వ్యక్తికి అందులో ఉన్న వారు లీజుకు ఇచ్చారని, దాన్ని దోపిడీ అని ఎలా అంటారని ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎన్నికల్లో 23 సీట్లతో ప్రజలు ఎలా తరిమికొట్టారో అబద్ధాలు మాట్లాడితే ఆదోని ప్రాంత ప్రజలు కూడా అలా తరిమికొడతారని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన విధంగా లోకేశ్‌కు చేయడం చేతకాదని విమర్శించారు. ప్రజల సమస్యలు తెలుసుకోకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదువుతూ లోకేశ్ చేసే పాదయాత్ర..జోకేశ్ పాదయాత్రలా ఉందని ఎద్దేవా చేశారు. మంగళగిరిలో చిత్తుగా ఓడిపోయిన వ్యక్తి స్థాయికి మించి విమర్శలు చేయడం తగదన్నారు. మహిళల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, వైస్ చైర్మన్ నరసింహులు, పట్టణ గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, దేవా, నాయకులు గోపాల్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, కామాక్షి తిమ్మప్ప, కిశోర్, అశోక్, చిన్నా, సన్నీ, రామాంజనేయులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మిగనూరు నుంచి కొత్త బస్సు సర్వీసులు

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి మూడు కొత్త బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. శనివారం స్థానిక డిపోలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సర్వీసుల వివరాలను వెల్లడించారు. ఈనెల 25 నుంచి ప్రతి రోజు ఉదయం 9గంటలకు ఎమ్మిగనూరు నుంచి శ్రీశైలానికి బస్సు సర్వీసును నడపనున్నామన్నారు. అలాగే ప్రతి రోజు ఉదయం 9 గంటలకు మంత్రాలయం నుంచి మహానందికి ఒక బస్సు నడపనున్నామన్నారు. మే 4న స్థానిక డిపో నుంచి భక్తుల కోసం కర్నూలు, కడప, చిత్తూరు మీదుగా అరుణాచలానికి ఒక బస్సు సర్వీసును నడపనున్నట్లు తెలిపారు. ఆయా బస్సు సర్వీసుల కోసం ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

పండుగ రోజు విషాదం


మృతిచెందిన ఖదీర్

ఆత్మకూరురూరల్: రంజాన్ పండుగ రోజు ఓ కుటుంబానికి తీవ్ర విషాదం మిగిలింది. పట్టణానికి చెందిన ఖదీర్(05) అనే బాలుడు ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. పట్టణంలోని నీలితొట్ల వీధి సమీపంలో ఖదీర్ అనే బాలుడు మరొక చిన్నారితో కలసి సైకిల్‌పై వెళుతుండగా పట్టణానికే చెందిన గుర్రాల ఖలీల్ అనే యువకుడు బుల్లెట్ మోటార్ సైకిల్‌పై వేగంగా వెళుతూ వారిని ఢీ కొట్టాడు. దీంతో ఎగిరి పడ్డ చిన్నారులు ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలో ఉన్న వారు వీరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగానే తీవ్రంగా గాయపడ్డ ఖదీర్ మృతి చెందాడు. మరొక చిన్నారికి వైద్యం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా మద్యం తాగి ద్విచక్ర వాహనాలపై వేగంగా వెళ్లడం పట్టణంలో పరిపాటిగా మారిందని , నిందితున్ని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మృతుడి తల్లిదండ్రులు, బంధువులు స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేస్తామని సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ కృష్ణమూర్తి హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

ఉరిమిన ఆకాశం.. పిడుగుల బీభత్సం


శిరివెళ్లలో నేలకొరిగిన వరి పైరు


కొత్తపల్లి మండలం వీరాపురంలో దెబ్బతిన్న అరటితోట


వెల్దుర్తి మండలం సిద్ధనగట్టులో నేలమట్టమైన బొప్పాయితోట

అకాల వర్షాలతో రైతు కుదేలు

- వరి, మామిడి, మిరపకు నష్టం
- పలుచోట్ల పిడుగుపాటు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. ఈ కారణంగా ఉష్ణోగ్రత రెండు డిగ్రీల వరకు తగ్గింది. అయితే వడగాలుల తీవ్రత కొనసాగింది. వర్షాలు ఒక మోస్తరుకే పరిమితం కాగా.. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వరి పంట దెబ్బతినింది. మామిడికి భారీగా నష్టం జరిగినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లా మొత్తం మీద 3.9 మిల్లీమీటర్లు, నంద్యాల జిల్లాలో 6.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

వరి, ఎండుమిర్చికి అపార నష్టం

అకాల వర్షాల వల్ల పలు పంటలకు భారీగా నష్టం జరిగింది. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, రుద్రవరం, శిరువెళ్ల, ఆత్మకూరు, అవుకు తదితర ప్రాంతాల్లో రబీలో వేసిన వరి కోతలు జరుగుతున్నాయి. వర్షంతో పాటు గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల వరి పైరు చెల్లాచెదురయింది. కంకులు తడవడం వల్ల ధాన్యం రంగుమారే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిర్చి పంటను కల్లందొడ్లు, పొలాల్లోనే ఆరబెట్టారు. అకాల వర్షాల వల్ల మిర్చి పంట కూడా తడిచిపోయింది. ఇక విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాములపాడు, ఆత్మకూరు, కొత్తపల్లి తదితర మండలాల్లో గాలుల తీవ్రతకు విద్యుత్ స్తంభాల విరగడం, వైర్లు తెగిపడ్డాయి. బేతంచెర్ల, ఓర్వకల్, గూడూరు, సి.బెళగల్ ప్రాంతాల్లో గాలుల వల్ల మామిడి పంట దెబ్బతినింది. వెల్దుర్తి మండలంలో శనివారం సాయంత్రం పెనుగాలులతో వడగండ్ల వాన కురిసింది. మామిడి పంట నేల రాలగా.. బొప్పాయి పంటలకు నష్టం జరిగింది.

ప్రాంతం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
సి.బెళగల్	26.8
మంత్రాలయం	22.6
ఆత్మకూరు	21.4
శిరువెళ్ల	18.8
అవుకు	18.2
ఓర్వకల్	16.2
దొర్నిపాడు	12.8
రుద్రవరం	12.2
ఎమ్మిగనూరు	11.8

కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వర్షాలు పడటం వల్ల ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. ఎండల తీవ్రత 45 డిగ్రీలు దాటింది. వర్షాల కారణంగా రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గాయి. అయితే వడగాలుల తీవ్రత కొనసాగింది. మంత్రాలయం మండలం వగరూరులో 41.4 డిగ్రీలు, మంత్రాలయంలో 41.38, కౌతాళం మండలం నదిచాగిలో 41.29 కోడుమూరులో 41.17, ఆత్మకూరులో 40.95 డిగ్రీలు, శ్రీశైలంలో 40.81 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రత నమోదయింది.


టెంకాయ చెట్టుపై పిడుగు పడి కాలిపోయిన దృశ్యం

పిడుగుపాటుకు ఏడుగురికి అస్వస్థత


అవుకు: శివవరం గ్రామంలో పిడుగు పడి ఏడుగురు వ్యక్తులు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి వర్ష సూచన కనిపించడంతో గ్రామ సమీపంలో పొలాల్లో ఆరబెట్టిన మిరప దిగుబడిపై పట్టాలు కప్పేందుకు సుదర్శన్ రెడ్డి, సుమిత్ర, సుగుణవతి, గుంతనాల శివ, అసాన్, జగదీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి వెళ్లారు. కొద్ది సేపటికి భారీ వర్షం పడటంతో వారంతా ట్రాక్టర్ ట్రాలీ కిందకు చేరారు. అదే సమయంలో టెంకాయ చెట్టుపై పిడుగుపడింది. ఆ శబ్దానికి ట్రాలీ కింద ఉన్న వారు షాక్‌కు గురై అపస్మారక స్థితికి వెళ్లారు. గ్రామస్తులు వారిని ఇళ్లకు తీసుకురాగా కొద్దిసేపటి తర్వాత ఆరుగురు కోలుకున్నారు. శివ అనే వ్యక్తికి కళ్లు కనిపించకపోవడంతో నంద్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో కోలుకున్నాడు. అలాగే గ్రామంలోని గడ్డం క్రిష్టారెడ్డి, భీమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిడుగుపాటుకు షాక్ గురయ్యారని, వారికి చెందిన బైక్ కూడా ధ్వంసమైనట్లు గ్రామస్తులు తెలిపారు.

కలమందలపాడులో..


బీరువా కాలిన దృశ్యం

మిడుతూరు: కలమందలపాడు గ్రామానికి దూదేకుల నవ్యమ్మ ఇంటి గోడపై శనివార సాయంత్రం పిడుగు పడటంతో ఇంటి లోపల ఉన్న బీరువాకు విద్యుత్ ప్రసరించి అందులో ఉన్న రూ. 50 వేల నగదు, ధ్రువీకరణ పత్రాలు, దుస్తులు ఖాళీ పోయాయి. ఒంటరిగా ఉంటున్న ఆమె పిడుగుపాటు సమయంలో ఇంటి ముందు ఉండటంతో క్షేమంగా బయటపడింది.

ఇంటిపై పడిన పిడుగు


ఇంటి పైకప్పుకు ఏర్పడిన రంధ్రం

పగిడ్యాల: కొత్త ముచ్చుమర్రి ఎస్సీ కాలనీలో శనివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఓ ఇంటిపై పిడుగు పడింది. గ్రామానికి చెందిన పాలమర్రి లక్ష్మన్న అలియాస్ రాజు నివసిస్తున్న ఇంటిపై హఠాత్తుగా పడిన పిడిగుపాటుకు శ్లాబ్ దెబ్బతింది. త్రుటిలో ఇంట్లో ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది. పిడుగు శబ్దానికి చిన్నారులు సుహాస్, అక్షిత లు తీవ్ర షాక్‌కు గురై పడిపోయారు. 2గంటల తర్వాత కోలుకున్నారు. విద్యుదాఘాతంతో ఇంట్లో టీవీ, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు కాలిపోయాయి. గ్రామ రెవెన్యూ అధికారి మద్దిలేటి విచారించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. రూ. 2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.


ప్రాణాలతో బయటపడిన కుటుంబసభ్యులు

ఉద్యోగుల బిల్లులు చెల్లించడం హర్షణీయం

- ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగళరెడ్డి



కర్నూలు(అగ్రికల్చర్): జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు మార్చి 31 వరకు ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించడం హర్షణీయమని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగళరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ జీఏల్ఐ, జీపీఎఫ్, కమిటేషన్, గ్రాట్యుటీ, పెన్షన్ అరియర్స్, శాలరీ అరియర్స్, మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులను ప్రభుత్వం పరిష్కరించడం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమేనని, వారి ఆర్థిక ప్రయోజనాలను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు కూడా త్వరలో విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం ఎంత ముఖ్యమో, ఉద్యోగుల సంక్షేమం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నెరవేరుస్తుందనే నమ్మకం ఉందన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ. లక్ష విరాళం


దాతలకు విరాళ బాండు అందజేస్తున్న ఉరుకుంద దేవాలయ అధికారులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన మోటా రఘు, శ్వేత దంపతులు రూ.1,00,111 విరాళంగా అందజేశారు. వీరితో సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో అధికారులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను, విరాళ బాండును అందజేశారు. ఆలయాభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు కోరారు.



హంద్రీ.. తీరింది దాహార్తి

గతంలో వేసవి కాలం వచ్చిందంటే జీవాలకు తాగునీరు లేక గొర్రెల కాపరులు ఇబ్బందులు పడేవారు. హంద్రీ నీవా కాలువ పనులు చేపట్టడంతో పాటు ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో పశువులకు, జీవాలను నీటి కొరత లేదని కాపరులు అంటున్నారు. బస్తిపాడు వద్ద హంద్రీ నదిలో జీవాలు నీరు తాగుతున్న దృశ్యమిది. – కల్లూరు

కలెక్టరేట్ సుందరీకరణకు చర్యలు

- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- శుభ్రత పాటించకపోతే జరిమానా
- కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ సుందరీకరణకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన తెలిపారు. కార్యాలయాల పరిసరాలను సంబంధిత శాఖల అధికారులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో, డ్వామా, వ్యవసాయ, పశుసంవర్ధక , డీఆర్‌డీఏ, సీపీఓ, ఎలక్షన్ సెల్, జిల్లా పంచాయతీ కార్యాలయాలు, సునయన ఆడిటోరియాలను మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, డీఆర్వో నాగేశ్వరరావులతో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టరేట్‌లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండకూడదన్నారు. భోజనం చేసిన ప్లేట్లు, కాఫీ కప్పులను పరిసరాల్లోనే పడేశారని, వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. గతంలో ఎంతో అపరిశుభ్రత ఉండేదని, తన ఆదేశాలతో కొంత వరకు మార్పు వచ్చిందన్నారు. కార్యాలయాల పరిసరాలు శుభ్రంగా లేకపోతే జరిమానా విధిస్తానని హెచ్చరించారు. వ్యర్థాల నిర్వహణకు చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో పాతబడిన, పనికిరాని వాహనాలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కారిడార్లలో వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఇంటర్నెట్ వైర్లను ఒక పైపులో అమర్చాలని సూచించారు. భవనాలన్నింటికీ వాటర్ ప్రూఫింగ్ చేయిస్తానని, స్లాబ్స్‌కు కూడా మరమ్మతులు మొదలు పెట్టిస్తానన్నారు. అన్ని ఫ్లోర్లలో కారిడార్ల మరమ్మతులు చేసి ఆధునికీకరిస్తామన్నారు. వాష్ రూమ్స్ బాగు చేయిస్తామని, తరువాత వాటి నిర్వహణ బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. కారిడార్లు, రూములు ముందు భాగాల్లో రంగులు వేయిస్తానన్నారు. సునయన ఆడిటోరియాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ స్కేపింగ్, పార్కులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. టూ వీలర్లు, ఫోర్ వీలర్లకు విడివిడిగా పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని డీఆర్వోను ఆదేశించారు. కలెక్టరేట్ లోపలికి వచ్చే వాహనాలను గేటు దగ్గరే నియంత్రించేలా చర్యలు చేపట్టాలన్నారు. లిఫ్ట్‌ను బాగు చేయించాలని, ప్రత్యేకంగా ర్యాంపులు ఏర్పాటు చేసి దివ్యాంగులకు అనువుగా మార్చాలన్నారు. ఆమె వెంట సీపీఓ ఎల్.అప్పలకొండ, అన్ని శాఖల అధికారులు ఉన్నారు.


సునయన ఆడిటోరియానికి వెళ్లే దారిలో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

వైరల్

అమ్మాజీ... కదిలించావు!

ఒక సిటీలో ఒక మహిళ రోడ్డు పక్కన ఎండలో కూర్చుని బఠాణీలు అమ్ముతోంది. ఈ దృశ్యం పవన్ కౌశిక్ అనే ట్విట్టర్ యూజర్ కంట్లో పడింది. 'ఈ వయసులో ఎండలో కూర్చొని కష్టపడుతోంది' అని జాలిపడి బేరం ఆడకుండా ఆమె దగ్గర ఉన్న బఠాణీల సంచులను హోల్‌సేల్‌గా కొనేశాడు.



ఆమెతో సెల్ఫీ దిగి తన సంతోషాన్ని ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 'అమ్మాజీకి సహాయపడినందుకు సంతోషంగా ఉంది' అంటూ రాశాడు.

ఈ ట్వీట్ వైరల్ కావడం మాట ఎలా ఉన్నా యూజర్స్ మాత్రం రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం వారు 'చాలా మంచి పనిచేశారు' అని ప్రశంసిస్తే మరో వర్గం మాత్రం 'చేసిన మంచి పని చెప్పుకోకూడదు. పబ్లిసిటీ ఎందుకు!' అంటూ ఘాటుగా విమర్శించారు. ఆ విమర్శలకు పవన్ కౌశిక్ ఇలా స్పందించాడు.. 'నేను చేసింది చాలా చిన్న పని అనే విషయం, ఆ సహాయం వల్ల అమ్మాజీ జీవితం మారదనే విషయం నాకు తెలుసు. అయితే ఈ పని నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది'

అయ్ బామ్మోయి!

సంప్రదాయ దుస్తుల్లో బామ్మలు వీధుల్లో స్కేట్‌బోర్డింగ్ చేస్తున్న చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇది నిజం కాదు. బామ్మలు నిజమే. స్కేట్‌బోర్డింగ్ మాత్రం ఏఐ సృష్టి!



ఆశిష్ జోస్ అనే ఆర్టిస్ట్ ప్రాంప్ట్-బేస్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్ 'మిడ్‌జర్నీ'ని ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించాడు.

'స్కేటింగ్ నానీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మూడు రోజుల వ్యవధిలోనే 1.17 లక్షల వ్యూస్ వచ్చాయి.

'సాహసానికి వయసు అడ్డు కాదు'లాంటి ఎన్నో కామెంట్స్ కనిపించాయి.

జై శ్రీ అన్నా

గతంతో పోల్చితే చిరుధాన్యాల పెద్ద ఉపయోగాల గురించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా విస్తృత అవగాహన పెరిగింది. దీనికి సాక్ష్యంగా నిలిచే వీడియోను ప్రధానమంత్రి నరేంద్రమోదీ షేర్ చేశారు.



'వైబ్రెంట్ విలేజెస్' కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఒక గ్రామంలోకి వెళ్లారు.

ఆ గ్రామంలోని ఒక మహిళ మంత్రిగారికి చిరుధాన్యాలతో చేసిన సంప్రదాయ వంటల రుచి చూపించడమే కాదు... జొన్నె రొట్టె నుంచి రాగి లడ్డు వరకు చిరుధాన్యాలు చేసే మంచి గురించి మంచిగా మాట్లాడింది. ప్రధాని ప్రశంస అందుకొంది.

'ప్రతి పల్లెలో ఇలాంటి దృశ్యం కనిపించాలి'... 'క్షేత్రస్థాయి నుంచి మొదలైన స్పృహ, చైతన్యం వేగంగా విస్తరిస్తుంది'... 'కనుల విందు చేసే వీడియో'... ఇలాంటి కామెంట్స్ కనిపించాయి.

స్వీట్‌వాయిస్ చిట్టెమ్మ!

పియానో వాయిస్తూ ఒక మహిళతో కలిసి కన్నడ పాట పాడుతున్న చిన్నారి వీడియో సోషల్ మీడియాలో వీర లెవల్లో వైరల్ అయింది. అనంత్ కుమార్ అనే యూజర్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు. పాడుతున్న సమయంలో చిన్నారి ప్రదర్శించిన హావభావాలకు నెటిజనులు ఫిదా అయ్యారు. 'ఆహా' అంటూ అబ్బురపడ్డారు.



'పక్కనే తీయటి సెలయేరు పారుతున్నట్లుగా ఉంది' 'మ్యాజిక్ వాయిస్ ప్లస్ బ్యూటీఫుల్ ఎక్స్‌ప్రెషన్స్' లాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఆన్‌లైన్ ప్రేక్షకులకు ఈ చిన్నారి గొంతు కొత్తేమీ కాదు. గత సంవత్సరం బాలీవుడ్ సినిమా 'కబీర్‌సింగ్' సినిమాలోని 'కైసే హువా' పాటను అద్భుతంగా పాడింది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

పల్లో లట్కే

డ్యాన్సింగ్ వీడియోలు సోషల్ మీడియాలో పాపులర్ కావడం అనేది కొత్త విషయమేమీ కాదు. అయితే అమ్మాయిల బృందం చేసిన ఈ డ్యాన్స్ వీడియో వారం రోజుల వ్యవధిలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 1.1 మిలియన్ వ్యూలను సొంతం చేసుకుంది. 'అసలు కంటే కాపీ ముద్దు' అనే సామెత లేదు గానీ ఈ వీడియో క్లిప్ చూస్తే అలాగే అనిపిస్తుంది.

'షాదీ మే జరూరు ఆనా' అనే హిందీ సినిమాలోని 'పల్లో లట్కే' సాంగ్‌కు ఈ యువబృందం వేసిన స్టెప్పులు 'అహా' అనిపించాయి.



'ఏబీసీడీ డ్యాన్స్ ఫ్యాక్టరీ' ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'అప్పుడెప్పుడో పెళ్లిసంబరాల్లో డ్యాన్స్ చేసేదాన్ని. ఈ వీడియో చూస్తుంటే...నా మోకాల నొప్పులను పక్కనపెట్టి డ్యాన్స్ చేయాలని ఉంది' అని కామెంట్ పెట్టింది 69 సంవత్సరాల రాధాబాయి.

వీడియో తెగ వైరల్ అయిందని చెప్పడానికి ఇంతకు మించిన కామెంట్ అక్కర్లేదేమో!

పాటల తుపాకీ...

దేశ సరిహద్దులో బీఎస్ఎఫ్ జవాన్. వేదికల మీద పాటలు పాడుతూ తనలో ఉన్న కళకు హద్దులు లేవని నిరూపిస్తున్నారు. 'డ్యూటీలో ఉంటూ గాన సాధన కూడా చేయడంతో ఈ పాట నాకు బాగా వంట పట్టింది' అంటూ ఇటీవల హైదరాబాద్ వచ్చిన చక్రపాణి నగరి తన గురించి వివరించారు.



చక్రపాణి నగరి

"మాది శ్రీకాకుళం జిల్లా, పలాస. టెన్త్‌క్లాస్ వరకు హైదరాబాద్ హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో బీఎస్ఎఫ్‌కు సంబంధించిన ఒక ప్రకటన చూసి, అప్లై చేశాను. ఆ పరీక్షల్లో సెలక్ట్ అయ్యి 2013లో బీఎస్ఎఫ్‌లో చేరాను. ఇప్పటి వరకు రాజస్థాన్‌లో పని చేశాను. ఇప్పుడు సెలవు మీద హైదరాబాద్‌కు వచ్చాను. సెలవు పూర్తవగానే జమ్ములో విధులు నిర్వర్తించాలి.

డ్యూటీలో ఉంటూ..

ఏదో ఒకటి పాడుకుంటూ ఉండటం అనేది స్కూల్ టైమ్ నుంచే ఉండేది. కానీ, ఎప్పుడూ దానిని నా డ్రీమ్ ప్రాజెక్ట్ అనుకోలేదు. బీఎస్ఎఫ్‌లో చేరిన తర్వాత అక్కడ మా టీమ్, క్యాంపుల్లో సరదాగా పాడుతుండేవాడిని. నెలకు ఒకసారి ఏదో ఒక సెలబ్రేషన్ ప్రోగ్రామ్ జరుగుతుంటుంది. ఆ సమయంలో అన్నీ హిందీ పాటలు పాడేవాడిని. అక్కడున్నవారందరికీ హిందీ తెలుసు కాబట్టి, అవే పాటలు పాడేవాడిని. మా తోటి జవాన్‌లే కాదు ఆఫీసర్స్ కూడా చాలా ప్రోత్సహించేవారు. డ్యూటీలో ఉన్నా లేకున్నా పాటలు పాడటం మాత్రం ఆగేది కాదు. ఇక మా ఊరికి వచ్చినప్పుడు పెళ్లిళ్లు వంటి వేడుకల సందర్భాల్లోనూ నా గాన కచేరీ ఉండేది. ఖాళీ సమయంలో డిజిటల్ మీడియాని ఫాలో అవుతుంటాను. అలా, హైదరాబాద్‌లోని ఓ టీవీ పాటల కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని ప్రకటన చూసి, అప్లై చేసుకున్నాను. వేల మందిలో నాకు అవకాశం రావడంతో చాలా సంతోషంగా అనిపించింది. ఈ విషయాన్ని మా అధికారులకు చెబితే వాళ్లు వెంటనే ఓకే చేశారు. ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడమే కాదు, గాన గంధర్వుడు బాలుగారి మైక్‌ను కానుకగా అందుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది.

కష్టపడుతూ..

మా అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నా చిన్నప్పుడే నాన్న చనిపోవడంతో మా అమ్మ చాలా కష్టాలు పడింది. మమ్మల్ని హాస్టల్‌లో ఉంచి, తెలిసినవారి ద్వారా ఢిల్లీ వెళ్లి, పనులు చేసి, మాకు డబ్బు పంపేది. ఇప్పుడు అమ్మ ఊళ్లో వ్యవసాయం పనులు చేస్తుంది. అన్నయ్య సొంతగా బేకరీ నడిపిస్తున్నాడు. అక్క గ్రామవాలంటీర్‌గా చేస్తోంది. మాకు కష్టం విలువ తెలుసు, స్వయంగా ఎదగడానికి మా వంతుగా కృషి చేస్తూనే వచ్చాం. ఆ కష్టంలో నుంచే ఈ పాట పుట్టుకు వచ్చిందనుకుంటాను. ఎక్కడ ఉన్నా కళ రాణిస్తుందనడానికి నేనే ఉదాహరణ అనిపిస్తుంటుంది. మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని సింగర్‌గా రాణించాలనుకుంటున్నాను" అని తెలియజేశాడు ఈ జవాన్.

– నిర్మలారెడ్డి

హెల్త్

బోన్ మ్యారో ఫెయిల్యూర్?



ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్లు... ఇలా రక్తంలోని కీలక కణాలకు పుట్టినిల్లు మూలుగ! కానీ అన్ని అవయవాల లాగే ఇది కూడా విఫలం కావచ్చు. హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీ ఫెయిల్యూర్, లివర్ ఫెయిల్యూర్ లాగే బోన్ మ్యారో ఫెయిల్యూర్ కూడా జరగవచ్చునన్న మాట. ఈ ఫెయిల్యూర్‌ను వైద్యపరిభాషలో 'అప్లాస్టిక్ అనిమియా' అంటారు. గతంలో కాస్త అరుదే అయినా ఇటీవల ఈ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బోన్ మ్యారో ఫెయిల్యూర్ మీద అవగాహన కోసం ఈ కథనం.

నిజానికి మూలుగ వైఫల్యం కూడా ఓ ఆటో ఇమ్యూన్ డిసీజ్. అంటే మన సొంత రోగనిరోధక శక్తి మన సొంత కణాలపై ప్రతికూలంగా ఏర్పడటం వల్ల వచ్చే వ్యాధి. దాంతో మూలుగ ప్రభావితమై, రక్తంలోని కణాల పుట్టుక, ఆరోగ్యకరమైన పెరుగుదల దెబ్బతింటుంది. ఫలితంగా ఎర్ర, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్ల కౌంట్ నార్మల్‌గా ఉండక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. 'అప్లాస్టిక్ అనిమియా' కండిషన్ ఏ వయసువారిలోనైనా, ఎప్పుడైనా రావచ్చు. సాధారణంగా చిన్న పిల్లల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఆసియావాసుల్లో అందునా మన దేశంలోనే ఈ కేసులు ఎక్కువ. దాదాపు 75 శాతం కేసుల్లో కారణాలు తెలియదు. అయితే మిగతా 25% కేసుల్లో ఈ కింది అంశాలు కారణం కావచ్చు.

తెల్లరక్తకణాలు తగ్గడం వల్ల...

ఈ కండిషన్‌ను 'న్యూట్రోపీనియా' అంటారు. తెల్లరక్తకణాలు మన లోని వ్యాధినిరోధక శక్తికి తోడ్పడి ఇన్ఫెక్షన్లతో పోరాడతాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల తేలిగ్గా ఇన్ఫెక్షన్ల బారిన పడటం, తరచూ జ్వరం రావడం వంటి పరిణామాలు ఏర్పడతాయి. ముఖ్యంగా మూత్రకోశం (బ్లాడర్) ఇన్ఫెక్షన్లకు గురి కావడం, మూత్రంలో మంట, మూత్రవిసర్జనలో నొప్పి, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో కష్టం, నోటిలో పుండ్లు, సైనస్ సమస్య, ముక్కు దిబ్బడ, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లు కనిపిస్తుంటాయి. అప్లాస్టిక్ అనిమియా ఉన్నవారిలో జ్వరం చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించవచ్చు. చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కావచ్చు.

ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్ల... : ఏదైనా గాయం అయినప్పుడు రక్తస్రావాన్ని నిరోధించడానికి రక్తం గడ్డకట్టే ప్రక్రియకు ప్లేట్‌లెట్స్ తోడ్పడతాయన్న విషయం తెలిసిందే. అందుకే ఇవి లోపించినప్పుడు రక్తస్రావం ముప్పు ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గే కండిషన్‌ను 'థ్రాంబోసైటోపీనియా' అంటారు. దీనివల్ల చిన్న చిన్న గాయాలకే తీవ్రమైన రక్తస్రావం, ముక్కు నుంచి రక్తస్రావం, చర్మం కింది పొర లో రక్తపు చుక్కల్లా ఎర్రమచ్చల్లాంటివి కనిపించడం, బ్రష్ చేసుకుంటున్నప్పుడు చిగుర్లు ఏమాత్రం దెబ్బతిన్నా తేలిగ్గా రక్తం వస్తుండటం, ఇక మహిళల్లోనైతే పీరియడ్స్ సమయంలో విపరీతమైన రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినప్పుడు అంతర్గత రక్తస్రావం కూడా కనిపించవచ్చు. ఈ కేసులో రక్తస్రావం కూడా ఓ మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించాలి. బయట రక్తస్రావం అవుతుంటే హాస్పిటల్‌కు చేరేవరకు రక్తస్రావాన్ని ఆపడానికి ప్రయత్నించాలి.

నిర్ధారణ: సరైన చికిత్స కోసం సమస్య ను సరిగ్గా నిర్ధారణ చేయడం అవసరం. ఇందుకు కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వంటి రొటీన్ బ్లడ్ వర్కప్స్, కిడ్నీ ఫంక్షన్ పరీక్ష, బోన్ మ్యారో పరీక్షలు తోడ్పడతాయి.

చికిత్స : – చాలా స్వల్పమైన లేదా ఓ మోస్తరుగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో వారికి ఎలాంటి సమస్యా లేకపోతే తక్షణం పెద్దగా చికిత్స ఏదీ అవసరం ఉండదు. కానీ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్న అప్లాస్టిక్ అనిమియా బాధితుల్లో మాత్రం ముమ్ముందు రాబోయే దుష్పరిణామాలను నివారించడం కోసం చికిత్స అవసరం. ఇలాంటివారికి తరచూ రక్తం ఎక్కిస్తుండటం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), జ్వరం, ఇన్ఫెక్షన్లు ఉన్నప్పుడు యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించేందుకు యాంటీ ఫంగల్ మందులు ఇవ్వడం అవసరం.

ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ : మన రోగనిరోధక వ్యవస్థ అతి చురుగ్గా మారి సొంత కణాలపై ప్రతికూలంగా పనిచేస్తున్నందున ఈ సమస్య వస్తుంది కాబట్టి... ఆ ఇమ్యూనిటీ చురుకుదనాన్ని తగ్గించే ఏటీజీ, సైక్లోస్పోరిన్ వంటి వాటిని ఉపయోగించి కూడా ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్ : ఈ చికిత్సలో అనారోగ్యకరమైన / సమస్యాత్మకమైన మూలుగ స్థానంలో ఇతరుల నుంచి (తమకు సరిపడే విధంగా / మ్యాచ్ అయ్యే విధంగా) ఉన్న ఆరోగ్యకరమైన దాత రక్తం నుంచి సేకరించిన మూలకణాలు మార్పిడి చేస్తారు. ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ లేదా ఇతరత్రా చికిత్సలు పనిచేయనప్పుడు, ఇదే మంచి ప్రత్యామ్నాయం. అయితే ఇందుకు దాత నుంచి సేకరించే మూల కణాలు జన్యుపరంగా స్వీకర్తతో సరిపోలాల్సి ఉంటుంది. అందుకే కుటుంబ సభ్యుల నుంచి సేకరించే మూలకణాలకు మొదటి ప్రాధాన్యం. ఇతరుల నుంచి సేకరించినప్పుడు అందులోని చాలా అంశాలు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. అయితే ఇదొక సంక్లిష్టమైన ప్రక్రియ. ఇందుకోసం హాస్పిటల్‌లో నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స అవసరమవుతుంది. చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉండటంతో ఈ సైడ్‌ఎఫెక్ట్స్ గురించి స్టెమ్‌సెల్ మార్పిడి నిపుణులతో చర్చించాకే ఈ చికిత్సకు వెళ్లాల్సి ఉంటుంది.

సరికొత్త చికిత్స ప్రక్రియలు : పైన పేర్కొన్న చికిత్సలే కాకుండా ఇప్పుడు మరింత అత్యాధునికమైన 'ఎల్ట్రాంబోప్యాగ్', 'రోమిప్లాటిజమ్' వంటి నూతన చికిత్సలూ– అందుబాటులోకి వచ్చాయి. మూలుగ మార్పిడి చికిత్సకు అంత అనుకూలం కాని వారిలోనూ, ఇమ్యునోసప్రెసివ్ చికిత్సలకు అంతగా స్పందించని వారిలోనూ ఇవి మంచి ఫలితాలను ఇస్తున్నాయి.

> **కారణాలు :** ● క్రిమిసంహారక మందులకు, ఆర్సినిక్, బెంజీన్ వంటి విషపదార్థాలకు గురికావడం ● కొన్ని సందర్భాల్లో రేడియేషన్, కీమోథెరపీతో కూడా రావచ్చు ● రుమటాయిడ్ ఆర్థరైటిస్ లేదా లూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులకు తీసుకుంటున్న చికిత్సల వల్ల కూడా రావచ్చు ● హెపటైటిస్, కొన్ని ఇతర అరుదైన వైరస్‌లు ఎముక మజ్జ అణచివేతతో పాటు వైఫల్యానికి కారణం కావచ్చు ● హెపటైటిస్, ఎప్‌స్టెయిన్ బార్ వైరస్, సీఎంటీ వైరస్, పర్‌వైరస్ బి19 లేదా హెచ్‌ఐవీ వంటి సాంక్రమిక (ఇన్ఫెక్షియస్) వ్యాధుల తర్వాత కనిపించవచ్చు ● కొందరిలో వంశపారంపర్యంగా కూడా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు రావచ్చు. (ఇలా వంశపారంపర్యంగా ఈ జబ్బు వచ్చినప్పుడు మూలుగ మార్పిడి చికిత్స (బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్) ఒక్కటే తగిన చికిత్స) ● మైలోడిస్‌ప్లాస్టిక్ సిండ్రోమ్ : ఇది రక్తానికి చెందిన ఒక రకం క్యాన్సర్‌కు ముందు దశ. ఈ సమస్య రాబోయే కొందరిలో ఇది హైపోసెల్యులార్ బోన్ మ్యారో అనే కండిషన్ (అంటే రక్తంలో ఉండే కణాల సంఖ్య తగ్గుదల)తో కనిపించవచ్చు ● పరోక్సిస్మల్ నాక్టర్నల్ హీమోగ్లోబినూరియా (పీఎన్‌హెచ్) : మన మూలుగలో ఉండే కణాల్లోంచి తొలుత మూల కణాలు (స్టెమ్‌సెల్స్) పుడతాయి. అవి నిర్దుష్టంగా ఏయే కణాలు అంటే... ఎర్రరక్తకణాలు, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్లు ఏయే పరిమాణాలతో ఎంత ఉండాలో అన్నిగా మారిపోతుంటాయి. కానీ 'పైగా' (పీఐజీ-ఏ) అనే ఓ జీన్ మ్యుటేషన్ (జన్యు ఉత్పరివర్తనం) కారణంగా రక్తకణాల్లో ఉండాల్సిన ఓ ప్రొటీన్ లోపించడంతో ఎర్రరక్తకణాలు విరిగిపోయినట్లుగా అవుతాయి. ఈ పరిణామాలు జరిగినప్పుడు ఎముక మజ్జలోని మూలకణాలు కూడా నాశనం అవుతాయి.
>
> **లక్షణాలు :** అప్లాస్టిక్ అనిమియాతో ఎర్రరక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. ఫలితంగా ఈ కింది పరిణామాలు సంభవిస్తుంటాయి... ● ఎప్పుడూ నీరసం, నిస్సత్తువ ● చురుకుదనం లోపించడం, దేని పైనా దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● ఆకలి తగ్గడం, బరువు తగ్గడం ● బాగా పాలిపోయినట్లుగా ఉండటం ● చిన్న చిన్న పనులకూ తీవ్రంగా ఆయాసం, గుండె వేగం పెరగడం ● మెట్లు ఎక్కలేకపోవడం. చిన్నపాటి వ్యాయామాలకూ తీవ్రంగా ఆయాసం ● చిన్నపాటి గాయం అయినా, తీవ్రమైన రక్తస్రావం ● తరచూ ఇన్ఫెక్షన్లతో పాటు జ్వరం



డా॥ గూడల స్థితప్రజ్ఞ
కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజీ & హెమటో ఆంకాలజీ అండ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్

ఆహారంలో మార్పులతోనే నోటి దుర్వాసనకు అడ్డుకట్ట!



నోటి దుర్వాసనను వైద్యపరిభాషలో హాలిటోసిస్ అంటారు. మధుమేహం, గ్యాస్ట్రో ఇంటస్టినల్ జబ్బుల్లాంటి అండర్‌లైయింగ్ డిసీజెస్ ఏవీ లేనప్పుడు కేవలం కొన్ని ఆహారాలు, ఆహారాల్లో మార్పులతో నోటి దుర్వాసన తగ్గించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.

మన ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవడం, ద్రవపదార్థాలు ఎక్కువగా తాగడం వల్ల నోటి దుర్వాసనను అదుపు చేసుకోవచ్చు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పీచు పదార్థాలు గ్యాస్ట్రో ఇంటస్టినల్ మార్గాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుతాయి. ముఖ్యంగా ఆపిల్స్, క్యారట్స్ వంటి పీచు పదార్థాలు సమృద్ధిగా ఉన్న పండ్లు, కూరగాయలు నమిలి తినే ప్రక్రియలో అవి పళ్లను శుభ్రం చేస్తాయి. వీటిని తినడం వల్ల లాలాజలం ఎక్కువగా విడుదలై నోటిని శుభ్రంగా ఉంచుతుంది. తాజా పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల నోటి దుర్వాసనకు కారణమైన హైడ్రోజెన్ సల్ఫైడ్ అదుపులోకి వస్తుంది. చిగుళ్ల వ్యాధులూ తగ్గుతాయి.

మరికొన్ని చిట్కాలు... నోటి దుర్వాసనను అరికట్టడంలో కొత్తిమీర, పుదీనా, యాలక్కాయ వంటివి బాగా పని చేస్తాయి. ఆహారంతోపాటు లేదా నేరుగా వాడటం వల్ల కూడా నోటి దుర్వాసన తగ్గుతుంది. వాటిని నీటిలో మరిగించి ఆ టీని తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. దాంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. పాటించాక కూడా తగ్గకపోతే దంతాలు, చిగుర్లకు సంబంధించిన సమస్యగానీ, డయాబెటిస్ వంటి వ్యాధులు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

బ్లడ్ గ్రూపులు కలవకపోయినా కిడ్నీ మార్పిడి సాధ్యమే!

మూత్రపిండాలు నూరు శాతం పాడైపోయినప్పుడు కిడ్నీ మార్పిడి తప్ప మరొక ప్రత్యామ్నాయం ఉండదు. అయితే ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ జీవితాంతం ఆరోగ్యంగానే బతకవచ్చు. కాబట్టి ప్రభుత్వాలు నిర్దేశించిన మేరకు దగ్గరి బంధువులైన కొందరి నుంచి కిడ్నీ స్వీకరించడానికి అనుమతి ఉంటుంది.

కిడ్నీని రెండు రకాలుగా స్వీకరించడం సాధ్యమవుతుంది. మొదటిది లైవ్ డోనార్ నుంచి. అంటే బతికి ఉన్న దగ్గరి బంధువుల నుంచి సేకరిస్తారు. ఇక రెండోది కెడేవర్ డోనార్... అంటే ఏదైనా ప్రమాదానికి గురైనవారి దేహం బతికి ఉండి, మెదడు చనిపోయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించినప్పుడు ఆ దాతను 'కెడేవర్ డోనార్'గా చెబుతారు. లైవ్ డోనార్స్ విషయంలో రక్తసంబంధీకులు మాత్రమే కిడ్నీని స్వీకరించే సమయంలో రక్తపరీక్షలు చేస్తారు. అయితే ఎంత దగ్గరి బంధువులైనప్పటికీ దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలిసినప్పుడే (మ్యాచ్) అయినప్పుడే కిడ్నీ ఇవ్వడం, తీసుకోవడం సాధ్యమవుతుంది. అంతేకాదు... కిడ్నీ దానం చేసేవారికి హైబీపీ, మధుమేహం (డయాబెటిస్), గుండెజబ్బులు, మెదడుకు సంబంధించిన జబ్బులు, కాలేయవ్యాధులైన హెపటైటిస్-బి, సి ఉండకూడదు. తన కిడ్నీ దానం చేసినప్పటికీ దాతకు ఎలాంటి నష్టం ఉండదని నిర్ధారణ చేశాకే కిడ్నీ మార్పిడి చేస్తారు.

అయితే రక్తసంబంధీకుల బ్లడ్ గ్రూపులు కలవకపోతే రెండు మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు వైద్యశాస్త్రంలో వచ్చిన ఆధునిక పురోగతి వల్ల బ్లడ్ గ్రూపులు కలవకపోయినప్పటికీ కిడ్నీ ఇవ్వవచ్చు. ఇది రెండు రకాలుగా జరుగుతుంది.

మొదటిది... స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రెండోది ఏబీఓ ఇన్ కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్.

స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్: ఇందులో రక్త సంబంధీకులకు కిడ్నీ దానం చేయాలని ఉన్నప్పటికీ... దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూపులు కలవకపోవడం వల్ల అది సాధ్యపడనప్పుడు... అదే సమస్యతో బాధపడుతున్న వేరొకరి రక్త సంబంధీకులలో బ్లడ్ గ్రూపు సరిపడితే... వారి నుంచి కిడ్నీ స్వీకరించవచ్చు. ఇలా స్వీకరించినవారి రక్తసంబంధీకులు మళ్లీ వారికి తమ బంధువుల నుంచి కిడ్నీ ఇవ్వాల్సి ఉంటుంది. అంటే... రక్తసంబంధీకులే కిడ్నీ ఇస్తారు గానీ... కేవలం బ్లడ్‌గ్రూపులు కలవకపోవడం చేత... ఇరువర్గాలు వారు ఎదుటివారికి కిడ్నీ ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ విధానంలో వీరి కిడ్నీని వారి బంధువుకూ, వారి కిడ్నీని వీరి బంధువుకు అమర్చే ఏర్పాటు చేస్తారన్న మాట. అంటే తమ బంధువుకు సరిపడని గ్రూపు ఎదుటివారికి సరిపడనప్పుడు ఇలా చేస్తారు. ఈ ప్రక్రియలో బాధితులిద్దరి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఒకేసారి జరుగుతుంది. ఈ ప్రక్రియను 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు.



ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్: బ్లడ్ గ్రూపులు కలవనప్పటికీ ఇప్పుడున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిడ్నీ మార్పిడి చేయడం వీలవుతుంది. అయితే ఈ ప్రక్రియ కోసం కొన్ని నిర్దుష్టమైన పద్ధతులూ, కొన్ని ప్రత్యేకమైన మందుల్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా బ్లడ్‌గ్రూపు సరిపడకపోయినప్పటికీ జరిగే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్ని 'ఇన్‌కంపాటబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్' అంటారు. దీనిమీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే ఎలాంటి కిడ్నీ మార్పిడి అయినప్పటికీ... అది ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు, సూచనలకు అనుగుణంగానే జరగాల్సి ఉంటుంది.